

తోటలో ఆట



- పుట్లూరు మండలంలో జోరుగా పేకాట స్థావరాలు
- వైసీపీ నాయకుడి అరటి తోటలో ఆట
- తోటలోనే మధ్యాహ్నం ముక్క చుక్క
- రోజూ రూ.15లక్షల నుంచి రూ.20లక్షలకు పైగానే ఆట
- మంగపత్తాతో రోడ్డున పడుతున్న జీవితాలు
- ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

తాడిపత్రి, జూలై 26: అది ఓ అరటి తోట. ఏపుగా పెరిగింది. లోపల ఎవరున్నారో? ఏం జరుగుతోందో కూడా తోట బయట ఉన్న వారికి తెలియదు. లోపల అసలు మనుషులు ఉన్నారన్న అనుమానం కూడా రాదు. ఇదే ఓ వైసీపీ నాయకుడి అక్రమ సంపాదనకు మార్గంగా మారింది. అందుకే ఆయన మూడు ముక్కల ఆటతో చెలరేగిపోతున్నాడు. ఈ ఆట వైసీపీ పాలనలో మొదలై నేటికీ కొనసాగుతోంది. అయితనా దీన్ని ఆపేవారు లేరు. ఈ తతంగమంతా పుట్లూరు మండలంలో యథేచ్ఛగా సాగుతోంది. పోలీసుల అండదండలతోనే వైసీపీ నాయకుడు తన అరటి తోటను పేకాట స్థావరంగా మార్చుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. సుబ్బరాయసాగర్ వద్ద ఓ వైసీపీ నాయకుడు తన అరటితోటలో పదుల సంఖ్యలో ఆటగాళ్లను రప్పించి పేకాట ఆడిస్తున్నట్లు తెలిసింది. ఈ తతంగమంతా పోలీసు అధికారులకు తెలిసినా తెలియనట్లు ఉన్నారనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. ఈ పేకాటకేంద్రాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారేమోగానీ పుట్లూరు మండలంలోని పలు గ్రామాల్లోని కొండ ప్రాంతాలను స్థావరాలుగా ఏర్పాటు చేసుకొని పేకాట ఆడిస్తున్నారు. ఈ వ్యవహారంలో పలువురు వైసీపీ నాయకులే సూత్రధారులుగా ఉండటం గమనార్హం. పోలీస్‌స్టేషన్‌కు ఎంతో కొంత ముట్టజెప్పి తమవ్యాపారాన్ని నిరాటంకంగా సాగిస్తున్నట్లు సమాచారం.

చేతులు మారుతున్న లక్షలు

సుబ్బరాయసాగర్ వద్ద ఉదయం 9 గంటలకే పేకాట ప్రారంభమవుతోంది. మధ్యాహ్న సమయంలో నిర్వాహకుడే బిరియాని, మద్యం తెప్పిస్తార ట. పేకాటరాయుళ్లు అక్కడే తింటూ, తాగుతూ పేకాటలో మునిగిపోతు న్నట్లు సమాచారం. సాయంత్రం 3గంటల నుంచి 4గంటల్లోపు ఆట కట్టేసి తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. పేకాట ఆడేందుకు అనంతపురం, నంద్యాల, పులివెందుల, తాడిపత్రితోపాటు పలు ప్రాంతాల నుంచి ఆటగాళ్లు పెద్దఎత్తున కార్లు, ద్విచక్రవాహనాల్లో తరలి వస్తారు. కొండ ప్రాంతం కావడంతో పరిసర గ్రామాల రైతులు డ్యాం వద్దకు వెళుతున్నారులే అనుకుంటున్నారు. ఒక రోజుకు సుమారు రూ.15లక్షల నుంచి 20లక్షలకు పైగా ఆట జరుగుతున్నట్లు సమాచారం.

మధ్యాహ్నం మంగపత్తా

ప్రతిరోజూ ఉదయం ఒక ఎత్తు. మధ్యాహ్నం అయిందంటే మరో ఎత్తుగా ఆట కొనసాగుతోంది. ఉదయం పేకాటతో మొదలైన ఈ తతంగం మధ్యా హ్నం ముగుస్తుంది. ఈ ఆటలో చాలా సమయం తర్వాత కొద్దిమొత్తంలో మాత్రమే సంపాదిస్తుంటారు. కానీ మధ్యాహ్నం జరిగేదే అసలైన ఆట. అదే మంగపత్తా. కేవలం ఒక ఆటతోనే లక్షలు చేతులు మారతాయి. అది కూడా నిమిషాల వ్యవధిలోనే. ఇలా ఏకధాటిగా రెండుగంటల పాటు జరిగే మంగపత్తా ఆటలో ఎంతో మంది వేలు, లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆటలో సర్వం కోల్పోయినవారి జీవితాలు రోడ్డున పడుతున్నాయి. పేకాటకు బానిసైన వారు కొందరు, ఆస్తులు అమ్మి, మరికొందరు అప్పులు చేసి మరీ ఆట ఆడుతున్నారు. ఓడిపోయినవారు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్యలకు పాల్పడుతుండటంతో వారు కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి.

చూసీచూడనట్లుగా పోలీసులు

మండలకేంద్రానికి కేవలం పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం లో జరుగుతున్న పేకాట పోలీసులకు తెలియదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒకవేళ వారికి సమాచారం ఉన్నా మామూళ్లు అందుతుండటంతో మిన్నకుండిపోతున్నారేమో అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంత భారీస్థాయిలో పేకాట జరుగుతోందంటే అందరికి ముడుపులు అందుతున్నట్లే అన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల కాలంలో మండలంలో పేకాటరాయుళ్లను అరెస్టుచేసిన సందర్భాలు లేకపోవడమే నిదర్శనం. ఈ చీకటి పేకాటతో పరిసర తోటల యజమానులు, మహిళా రైతులు అటువైపు వెళ్లాలంటే జంకుతున్నారని సమాచారం.

సమాచారం ఇవ్వండి: సుబ్రహ్మణ్యం, సీఐ



పుట్లూరు మండలంలో పేకాట, మంగపత్తా ఎక్కడా ఆడుతున్నట్లు సమాచారం లేదు. ఒకవేళ ఆడుతున్నట్లు మీ దృష్టికి వస్తే మీడియానే మాకు సమాచారం ఇవ్వాలి. పేకాట ఆడేవారు, ఆడించే వారు ఇద్దరూ శిక్షార్హులే. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఖాళీగా ఉందా.. అమ్మేయ్!



బుక్కరాయసముద్రం జగనన్న లేఔట్‌లో అక్రమంగా వేసిన పునాది



పట్టా రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు విక్రయం

- ఆక్రమించుకోవడానికి రాత్రికి రాత్రే పునాదుల నిర్మాణం
- ఇంటి పట్టాలలో వైసీపీ నాయకుల దందా
- బీకేఎస్‌లో పట్టించుకోని రెవెన్యూ అధికారులు

బుక్కరాయసముద్రం, జూలై 26: మండలంలోని జగనన్న లేఔట్‌లలో మిగిలిపోయిన ఇంటి పట్టాల విక్రయాలు జోరుందుకున్నాయి. ఇంటి పట్టా ఉన్నా? లేకున్నా ఖాళీ స్థలం కనబడితే.. చాలు అక్కడ వైసీపీ నేతలు ప్రత్యక్షమవుతున్నారు. ప్లాటు రేటు బట్టి ధర నిర్ణయించి అమాయక ప్రజలకు కట్టబెడుతున్నారు. కొన్ని పట్టాలకు గతంలో ఇక్కడ పని చేసి వెళ్లిపోయిన తహసీల్దార్ల వద్దకు వెళ్లి సంతకాలు చేయించుకుని ఆక్రమించు కుంటున్నారు. రాత్రికి రాత్రే పునాదులు వేసేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. అక్రమ ప్లాట్ల దందాపై స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె ఇలాంటి ప్లాట్ల విక్రయాలు, అందులో నిర్మాణాలు వెంటనే ఆపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అయినా ఇవేవీ అక్రమ దందాను ఆపలేకపోతున్నాయి. పట్టా లేని స్థలం చూపిస్తే రూ.1.5 లక్ష నుంచి రూ.2లక్షలు వరకు అమాయక ప్రజలతో వసూలు చేస్తున్నారు. అలా కాకుండా గతంలో పనిచేసి వెళ్లిపోయిన తహసీల్దార్లుతో సంతకం చేయించి పట్టా తీసుకుని వస్తే మరో రూ.లక్ష అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. బీకేఎస్ గ్రామ పంచాయతీ లోనే కాకుండా రేకలకుంట, గోవిందంపల్లి, భద్రంపల్లి, దయ్యాలకుంటపల్లి గ్రామాలలో వేసిన జగనన్న లేఔట్‌లలో కూడా వైసీపీ నేతలు ఇప్పటికి దందాలు సాగిస్తున్నారు. అనంతపురం-నార్పల రహదారి పక్కనే ఉన్న రేకలకుంట లేఔట్‌లో ఒక ఇంటి పట్టా రూ. ఏడు లక్షల నుంచి తొమ్మిది లక్షల వరుకు ధర పలుకుతోంది. ఇందులో వైసీపీ నేతలు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారు.

బీకేఎస్ జగనన్న లేఔట్‌లో భారీ అక్రమాలు

వైసీపీ పాలనలో పేద ప్రజలకు ఇచ్చిన ఇంటి పట్టాల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయి. వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇంటి పట్టాలు ఇప్పించుకుని దోచుకుతిన్నారు. బినామీ పేర్లతో పదుల సంఖ్యలో తీసుకుని విక్రయాలు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో బుక్కరాయసముద్రంలోని జగనన్న కాలనీలో ఎనిమిది లేఔట్‌లు వేశారు. రైతులకు ఒక్కో ఎకరానికి రూ.20 లక్షలకు పైగా ప్రభుత్వ ధర చెల్లించి, 55 ఎకరాలు సేకరించారు. అందులో మౌలిక సదుపాయల కల్పన కోసం కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేశారు. ఇంటి పట్టాలు అర్హులందరికీ కాకుండా కేవలం వైసీపీ నాయకుల అనుచర వర్గానికే ఇప్పించుకున్నారు. ఎనిమిది లేఔట్‌లలో 2300 మందిపైగా నిరుపేదలను అర్హులుగా గుర్తించి, ఇంటిస్థలాలను చూపారు. అయితే ఇందులో కొంత మందిని మళ్లీ అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగించారు. అలాంటి వారి స్థలాలు పలు లేఔట్‌లలో మిగిపోయాయు. ఇందులో ఎక్కడ ఖాళీ స్థలం ఉందో రెవెన్యూ రికార్డులో చూడటం పట్టా ఇవ్వకుంటే కబ్జా చేస్తున్నారు.



బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయం

చర్యలు తప్పవు

మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో నవరత్నాల కింద జగనన్న కాలనీల్లో మంజూరు అయిన ప్లాట్లను అక్రమంగా విక్రయిస్తే చర్యలు తప్పవు. ఖాళీగా ఉన్న స్థలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అనుమతి లేకుండా, ఇంటి పట్టా లేకుండా ఇంట్లి నిర్మాణం చేపడితే తొలగిస్తాం. ప్రజలు కూడా ప్రభుత్వ ఇంటి స్థలాలను కొనగోలు చేయరాదు.

-హనుమంతునాయక్, తహసీల్దార్

బదిలీ తహసీల్దార్ల రిలీవ్

అనంతపురం టౌన్, జూలై 26: ఎన్నికల సమయంలో నిబంధనలకు లోబడి ఇతర జిల్లాలకు చెందిన తహసీల్దార్లు అనంత జిల్లాకు బదిలీపై వచ్చారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో తిరిగి వారందరినీ వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ వారం రోజుల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తుఫాన్ ప్రభావం నేపథ్యంలో వారిని రిలీవ్ చేయవద్దని ఆదేశాలు రావడంతో ఆగిపోయాయి. ఇపుడు ఆ బదిలీ ఉత్తర్వులు మేరకు ఇతర జిల్లాల నుంచి అనంత జిల్లాకు వచ్చిన 39మంది తహసీల్దార్లను శుక్రవారం రాత్రి కలెక్టరు వినోద్ కుమార్ రిలీవ్ చేశారు. వీరందరు శనివారం పని చేసే చోట రిలీవ్ అయి వారి సొంత జిల్లాలకు వెళ్లి అక్కడ కలెక్టర్ల వద్ద రిపోర్ట్ చేసుకుంటారని జిల్లా కలెక్టరు తెలిపారు. ఇతర జిల్లాలకు వెళ్లిన మన జిల్లాకు చెందిన తహసీల్దార్లు తిరిగి ఇక్కడకు రానున్నారు.

అమ్మ లేదని...

తల్లి మరణం జీర్ణించుకోలేక తనయుడి మృతి

రాయదుర్గంరూరల్, జూలై 26: నవమాసాలు మోసి కనిపెంచిన అమ్మ ఇక కానరాదని ఆ బిడ్డ గుండె తల్లడిల్లి ఆగిపోయింది. దీంతో గంటల వ్యవధిలోనే ఆ కుటుంబంలో ఇద్దరు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. మండలంలోని రేకులకుంట గ్రామంలో జరిగిన సంఘటన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన లక్ష్మక్క(52) గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుమారుడు తిప్పేస్వామి(38) కూడా గత నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రాయదుర్గం ఆస్పత్రికి వెళ్లిన తిప్పేస్వామి తల్లి మరణవార్త విని గ్రామానికి చేరుకున్నాడు. తల్లి శవాన్ని చూసి బోరున విలపిస్తూ కుప్పకూలిపోయాడు. ఎంతసేపటికీ లేవకపోవడంతో అక్కడున్న వారు లేపే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో పరీక్షించి మృతి చెందినట్లు తెలుసుకున్నారు. తల్లీ కొడుకులు ఒకేరోజు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి తండ్రి, భార్య ఉన్నట్లు బంధువులు తెలిపారు. అశ్రునయనాలతో శుక్రవారం వారికి అంత్యక్రియలు నిర్వహించారు.



తల్లీకొడుకుల మృతదేహాలు

వారి త్యాగం.. స్ఫూర్తిదాయకం

కార్గిల్ యుద్ధవీరులను కొనియాడిన కలెక్టరు



మాజీ సైనికులతో కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 26: కార్గిల్ యుద్ధ వీరుల త్యాగం, సాహసం అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్గిల్ యుద్ధవీరులు, మాజీ సైనికులకు కార్గిల్ విజయ్ దివస్ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ.. 1999 మే 3 నుంచి దాదాపు 60 రోజుల పాటు అతిశీతల మంచుకొండల్లో కార్గిల్ యుద్ధం జరిగిందన్నారు. ఆ యుద్ధంలో అనంతపురం జిల్లాకు చెందిన 30 మందికి పైగా సైనికులు ప్రాణాలకు తెగించి పోరాడారని తెలిపారు. కార్గిల్ యుద్ధ విజయంలో అనంత జిల్లాకు భాగస్వామ్యం ఉండటం జిల్లా ప్రజలందరికీ గర్వకారణమన్నారు. తాను కూడా ఐఏఎస్ శిక్షణలో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్- చైనా సరిహద్దులో మంచు పర్వతాలలో రెండువారాలపాటు మన సైనికులతో కలిసి శిక్షణ పొందినట్లు తెలిపారు. మాజీసైనికుల సంక్షేమంకోసం జిల్లాశాఖ తరఫున అన్నివిధాలుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికులు ఉమామహేశ్వరరావు, రమేష్‌కుమార్ రెడ్డి, సంజీవ, పలువురు అధికారులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

మత్తుపై నిఘా ఉంచండి

కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం టౌన్, జూలై 26: జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం లేకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అధికారు లను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ యువత మత్తుపదార్థాల వినియోగంతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. పాఠశాలలు, కళాశాల విద్యార్థులు ఈమత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వస్తున్న ప్రైవేటు బస్సులు, ఇతర వాహనా లను తనిఖీ చేయాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక డీ అడిక్షన్ వార్డు ఏర్పాటు చేయాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘాఉంచి మత్తు, మాదకద్రవ్యాలు రవాణాకాకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి మందుల షాపులో సీసీకెమెరాలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, సెబ్‌అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, డీటీసీ వీర్రాజు, ఆర్డీఓ రాణిసుష్మిత, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ.బీ.దేవి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టరు సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 2015-20, 2020-23, 2023-27వరకు ఏర్పాటు చేసిన యూనిట్లకు సబ్సిడీ సొమ్ము మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్ విండో పోర్టల్‌లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్నవాటికి అనుమతులు నిర్ణీత సమయంలో ఆమోదించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, పరిశ్రమశాఖ అధికారులను కలెక్టరు ఆదేశించారు. ఎంఎస్ఎంఈ రాప్తాడు పార్కులో పరిశ్రమలు ఏర్పాటుకు, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.

32 గేట్ల నుంచి నీటి విడుదల

టీబీ డ్యాం నుంచి విడుదల అవుతున్న నీరు



బొమ్మనహాళ్, జూలై 26: తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో మొత్తం 32 క్రస్ట్‌గేట్లు (20 గేట్లు రెండున్నర అడుగులు, మరో 12 గేట్లు రెండు అడుగుల మేర) ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. 1,07,096 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 8952 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. తుంగభద్ర జలాశయం పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,05,378 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,16,228 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105.788 టీఎంసీలు ఉండగా.. శుక్రవారం సాయంత్రానికి 1631.96 అడుగులతో 101.617 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 768 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.





వైసీపీ పాలనలో యథేచ్ఛగా భూ అక్రమాలు

- 22-ఏ, చుక్కల భూముల్లో అవినీతి
- సమగ్ర వివరాలివ్వాలని సీసీఎల్ఏ ఆదేశం
- రెవెన్యూ అక్రమార్కుల్లో మొదలైన వణుకు

పట్టుకుంటున్న భూతం

గత ఐదేళ్ల వివరాల సేకరణ

కళ్యాణదుర్గం: గత ఐదేళ్ల పాలనలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు, పాపాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఐదేళ్లుగా ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చారు. చుక్కల భూములు ఎన్ని ఎకరాలు చక్కబెట్టారు. నిషేధిత జాబితా నుంచి ఎంత తొలగించారనే వివరాలను ఆరా తీసే పనిలో ప్రభుత్వం నిమగ్నమైంది. వైసీపీ పాలనలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నుంచే దోపిడీకి బీజం పడింది. నియోజకవర్గంలోని కంబదూరు, కళ్యాణదుర్గంలో పనిచేసిన తహసీల్దార్లపై అధికార పార్టీ నాయకులు ఒత్తిడి తెచ్చి ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టాలు రాయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఇళ్ల పట్టాలను అక్రమమార్గం లో కొట్టేసి, వాటిని విక్రయించి వాటాలు పంచుకున్నట్లు సమాచారం. అలాగే ఈ రెండు మండలాల్లో 22ఏ జాబితాలో ఉన్న భూములపై కన్నేసిన వైసీపీ నాయకులు మంత్రి ఉష శ్రీచరణ్ అండదండలతో అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించారన్న విమర్శలు కూడా వినిపించాయి. అడిగినంత డబ్బు ఇస్తే ఎటు వంటి ఆధారాలు లేకున్నా వాటిని 22ఏ జాబితా నుంచి తొలగించారు. కొందరు నేతలు సెటిల్‌మెంట్ భూములను 22ఏలోకి చేర్పించి భూ యజ మానులను ము ప్పతిప్పలు పెట్టి ముక్కుపిండి వసూలు చేశారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చుక్కల భూముల సమస్యలు పరిష్కరించేందుకు భారీగా నగదు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా గుప్పుమంటున్నాయి. ఇటీవల రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి.

సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) అధికారులు ప్రధానంగా 22ఏ, చుక్కల భూముల నుంచి ఎన్ని ఎకరాలు తొలగించారు. ప్రభుత్వ, డీకేటీ భూముల్లో ఎన్ని ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. ఫ్రీహోల్డ్‌గా ఎంత చేశారు. మాజీ సైనికులకు ఎంత భూమి ఇచ్చారన్న వివరాలపై ప్రభుత్వం ఆరా తీసే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. వీటితో పాటు వ్యవసాయేతర భూమిగా ఎంత మార్చారనేది ప్రతి మండలం నుంచి నివేదిక కోరుతున్నట్లు తెలిసింది. ఇలా 2019 నుంచి 2024 జూలై 23 వరకు ఉన్న వివరాలు సమగ్రంగా సమర్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ప్రభుత్వ భూమిలో జగనన్న కాలనీలకు ఎంత ఇచ్చారు. ఇతర అవసరాలకు ఎంత కేటాయించారో కూడా స్పష్టం చేయాలని ప్రభుత్వ యంత్రాంగం కోరుతున్నట్లు తెలిసింది. చుక్కల భూమి వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోనే చుక్కల భూముల వ్యవహారంలో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది.

అప్పటి మంత్రి దందా బయటకు...

నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ చుక్కల భూముల వ్యవహారంలో భారీగా అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ఇందుకోసం తాను చెప్పినదానికి అనుగుణంగా పని చేసే తహసీల్దార్లను నియమించుకున్నారు. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించి లక్షలాది రూపాయలు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో చుక్కల భూముల దందాపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. అవన్నీ ఇప్పుడు బయటకు వచ్చే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు. దీంతో గత ఐదేళ్ల భూదోపిడీ కూడా బహిర్గతమయ్యే అవకాశం వుంది.

డబ్బులిస్తే చాలు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. చుక్కల భూములను కూడా దర్జాగా డబ్బు లు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. వైసీపీ హయాంలో అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ కనుసన్నల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమంతా పనిచేసింది. ఆ ఐదేళ్ల కాలంలో పనిచేసిన ఒక సబ్ రిజిస్ట్రార్ మంత్రి ఉష శ్రీచరణ్‌కు తొత్తుగా మారి ఆమె చెప్పిందే వేదంగా భావించి చుక్కల భూములు కూడా రిజిస్ట్రేషన్ చేయించారన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రతిరోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చిన అక్రమ ఆదాయాన్ని వాటాలు పంచుకున్నట్లు తెలిసింది. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వం లోతుగా వివరాలు సేకరిస్తుండటంతో సూత్రధారులు, పాత్రధారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



తొలుత తాగునీటికే..

తర్వాతే ఆయకట్టుకు..: హెచ్చెల్సీ ఎస్ఈ

కణేకల్లు, జూలై 26: తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న నీటిలో మొదటి ప్రాధాన్యం తాగునీటికే ఇస్తున్నామని తర్వాత సాగునీటిని ఆయకట్టుకు విడుదల చేస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం హెచ్చెల్సీ కెనాల్ 189 కి.మీ. నుంచి 105 కి.మీ. వరకు ఆయన హెచ్ఎల్సీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక కణేకల్లులో వారు విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర సరిహద్దులో వస్తున్న 750 క్యూసెక్కుల నీటిని కణేకల్లు చెరువు ద్వారా దిగువ వైపున ఉన్న తాగునీటి పథకాలకు విడుదల చేస్తున్నామన్నారు. కణేకల్లు చెరువు నుంచి వంద క్యూసెక్కుల నీరు బయటకు వెళుతున్నాయని పదిరోజుల పాటు వచ్చిన నీటిని జిల్లాలోని తాగునీటి సమ్మర్ స్టోరేజీల్లో నిల్వ చేయడం జరుగుతుందన్నారు. ఆగస్టు 2వ వారం తర్వాత ఐఏబీ సమావేశం నిర్వహించి ఆయకట్టు భూములకు ఎప్పుడు నీరు విడుదల చేయాలో నిర్ణయిస్తావనారు. కెనాల్ ప్రస్తుత పరిస్థితి అన్ని చోట్ల పటిష్టంగా ఉందని 1800 క్యూసెక్కుల మేర నీరు కాలువలో ప్రవహించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. అవసరాన్ని బట్టి ప్రతిరోజూ నీటి ఇండెంట్‌ను పెంచుకుని హెచ్చెల్సీలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూస్తామని వివరించారు. సమావేశంలో ఈఈ వెంకటరమణారెడ్డి, డీఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న ఎస్ఈ

బొమ్మనహాళ్: ఆంధ్ర సరిహద్దులోని 104/787 కి.మీ. వద్ద హెచ్చెల్సీ కాలువను శుక్రవారం సాయంత్రం ఈఈ రమణారెడ్డితో ఎస్ఈ రాజశేఖర్ పరిశీలించారు. నీటిమట్టాన్ని పరిశీలించి ఇన్‌ఫ్లో వస్తున్న జలాలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు రిజిష్టర్ నమోదుచేయాలని ఆదేశించారు. సరిహద్దులో హెచ్చుతగ్గులు లేకుండా నీటిని ఇవ్వాలని, ఈ నెల ఆఖరి వరకు ఇండెంట్ ఎక్కువస్థాయిలో పెంచకుండా ఇవ్వాలని కర్ణాటక సెక్షన్ ఆఫీసర్ భక్తవత్సలతో అన్నారు. నీటిపారుదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అనంతరం ఒకటవ డిస్ట్రిబ్యూటర్ వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట డీఈ మద్దిలేటి, ఏఈ అల్తాఫ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, నవీన్, ధనుంజయ, పయ్యావుల మోహన్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లో హంద్రీనీవా కాలువకు నీరు

కేఆర్ఎంబీకి లేఖ రాసిన అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26: రెండు, మూడు రోజుల్లో హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. జలవనరుల శాఖ జిల్లా సీఈ నాగరాజు, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్.. కృష్ణా యాజమాన్య బోర్డుకు అనుమతి కోసం లేఖ రాశారు. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 859 అడుగుల మేర 105 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 880 అడుగులు వచ్చే సమయానికి మల్యాల నుంచి రెండు పంపుల ద్వారా కృష్ణా జలాలను హంద్రీనీవాకు విడుదల చేయడానికి అనుమతి కోరారు. శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో 2.20 లక్షలు వస్తోంది. మొదట మల్యాల నుంచి 1000 క్యూసెక్కుల ప్రకారం హంద్రీనీవా కాలువకు నీరు వదలనున్నారు. ఐదు రోజుల తర్వాత జిల్లా సరిహద్దుల్లోకి నీరు ప్రవేశిస్తుంది. ఈ ఏడాది హంద్రీనీవాకు పూర్తిస్థాయి కేటాయింపులు 40 టీఎంసీలు వచ్చే అవకాశం ఉంది.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి

వైసీపీ సర్పంచ్‌పై జేసీ, తహసీల్దార్లకు డాక్టర్ ఫిర్యాదు

బుక్కరాయసముద్రం, జూలై 26: మండలంలోని గోవిందంపల్లి గ్రామంలో భూమి హక్కు లేకపోయిన రోడ్డు స్థలాన్ని రేగడికొత్తూరు గ్రామ సర్పంచ్ తిరుమల రెడ్డి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని అనంతపురం మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న శివశంకర్‌మూర్తి, మరో ఇద్దరు రైతులు అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతపురం ఇన్‌చార్జి జేసీ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ హనుమంతునాయక్, సీఐ వెంకటేశ్వర్లుకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గోవిందంపల్లి గ్రామంలో సర్వేనెంబర్‌లో 135-1ఏలో గ్రామానికి ఉన్న ప్రధాన రహదారికి వెళ్లిన 96 సెంట్ల స్థలాన్ని ఈ నెల 12న ఆన్‌లైన్‌లోకి తిరుమలరెడ్డి అక్రమంగా ఎక్కించాడని, 14న భద్రంపల్లి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని పేర్కొన్నాడు. రోడ్డుకు వెళ్లిన స్థలాన్ని ఆన్‌లైన్‌లో ఎలా ఎక్కిస్తారని ప్రశ్నించాడు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి ఆన్‌లైన్ 1బీ అడంగల్‌లో తొలిగించాలని జేసీ, తహసీల్దార్ ఆయన కోరారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని తమ భూమిలోసైతం తనకు హక్కు ఉందని డబ్బులు డిమాండ్ చేసేందుకు యత్నిస్తున్నాడని సీఐకి ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో కౌలురైతు మృతి



బోయ రాముడు (ఫైల్)

రాయదుర్గంరూరల్, జూలై 26: పొలంలో పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో కౌలురైతు బోయ రాముడు(40) శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని ఆర్‌బీవంక గ్రామానికి చెందిన రాముడు అదే ఊరికి చెందిన ఒక రైతుకు సంబంధించిన ఎకరాన్నర పొలాన్ని కౌలుకు తీసుకొని, వరి పంట సాగు చేశాడు. శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా కావడంతో మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లాడు. అప్పటికే స్టార్టర్ పెట్టెకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో షాక్ తగిలింది. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూలై 26: విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని ఆ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మట్టి తంబూర', 'మాకూ ఒక నది కావాలి' కవితా సంపుటాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

కీలక పోస్టుల కోసం క్యూ..

సీఈఓ, డీపీఓ పోస్టులకు యత్నాలు



జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, జూలై 26: జిల్లాలోని కీలక పోస్టులకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీనియర్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(డీఎల్‌డీఓలు) ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులతోపాటు, తాము చేయాలనుకుంటున్న పలు కీలక పోస్టులకు కొందరు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు అటు జిల్లాపరిషత్, ఇటు మండల పరిషత్ కార్యాలయాల్లో తీవ్రస్థాయిలో చర్చ సాగుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జిల్లా పరిషత్ సీఈఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ సీఈఓగా పనిచేస్తున్న వైఖోమ్ నిదియాదేవి రాజంపేటకు బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో సదరు పోస్టుకు డీఎల్‌డీఓ ఓబులమ్మ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆమె ప్రస్తుతం అనంతపురం డీఎల్‌డీఓగా పనిచేస్తున్నారు. ఇటీవల డీఆర్‌డీఓ పోస్టు ఖాళీ పడటంతో ఓబుళమ్మకు డీఆర్‌డీఓ ఇన్‌చార్జ్ పీడీగా బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల కలెక్టర్ ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసింది. ఆమె క్లియర్ వెకెన్సీ ఉన్న జడ్పీ సీఈఓ పోస్టుకు యత్నాలు చేస్తున్నట్లు ఆ శాఖ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కదిరి డీఎల్‌డీఓగా పనిచేస్తున్న సూర్యనారాయణ, డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్న డీఎల్‌డీఓ సుధాకర్‌రెడ్డి సైతం జిల్లా పంచాయతీ ఆఫీసర్ (డీపీఓ) పోస్టుకు ట్రై చేస్తున్నట్లు సమాచారం. జడ్పీ సీఈఓ పోస్టు ఖాళీ పడటంతో డీపీఓ ప్రభాకర్‌రావుకే ఇన్‌చార్జ్ సీఈఓ బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీపీఓ ప్రభాకర్‌రావు సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రభాకర్‌రావుది మరో జిల్లా కావడంతో ఇక్కడే పనిచేస్తున్న డీఎల్‌డీఓలు ఆ పోస్టును ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు డీఎల్‌డీఓలు ఆ పోస్టుకు యత్నాలు చేస్తున్నట్లు ఉద్యోగుల్లో చర్చ నడుస్తోంది. గతంలో జడ్పీ డిప్యూటీ సీఈఓగా, కొంతకాలం సీఈఓగా పనిచేసిన అనుభవం ఉన్న శ్రీనివాసులు టూరిజం శాఖలో రీజనల్ స్థాయి పోస్టుకు యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా పనిచేస్తున్న ఓబుళమ్మకు ఇటు జడ్పీ సీఈఓ పోస్టు కాకుండా, డీఆర్‌డీఏ రెగ్యులర్ పీడీగా ఉత్తర్వులు వస్తే శ్రీనివాసులుకు జడ్పీ సీఈఓగా ఉత్తర్వులు అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ టాక్ నడుస్తోంది. అటు సూర్యనారాయణ, ఇటు సుధాకర్‌రెడ్డిలో ఎవరో ఒకరికి డీపీఓగా ఉత్తర్వులు వస్తే వారిలో కూడా ఒకరు సీఈఓ పోస్టుకు పోటీపడే అవకాశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. సీఈఓ, డీపీఓ పోస్టులకు మాత్రం జిల్లాలో పనిచేసే డీఎల్‌డీఓల్లో సీనియర్లు బాగానే ట్రై చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రాజధాని బాట పట్టి ఆయా శాఖలు, తమకు తెలిసిన మంత్రులు, ఇతర ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు ఆయా శాఖ వర్గాల నుంచి తెలుస్తోంది.

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

కేబుల్ బాక్సుల మాటున రవాణా
పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు..
మరో ఇద్దరి కోసం గాలింపు
ఎస్పీ మురళీకృష్ణ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

రాయదుర్గంటౌన్, జూలై 26: పట్టణంలోని శివారుప్రాంతమైన ఉడేగోళం వద్ద అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. వచ్చిన సమాచారం మేరకు సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో డీటీఎఫ్ సీఐ వెంకటలక్ష్మి, ఇంటలిజెన్స్ సీఐ కృష్ణ, రాయదుర్గం సెబ్ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో రాయదుర్గం మండలం ఉడేగోళం వద్ద హైవేపై వాహనాలు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఐచర్ వాహనంలో గోవా నుంచి ఫినోలెక్స్ కేబుల్ బాక్సులను ఉంచి మధ్యలో 147 బాక్సుల గోవా మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అక్రమ మద్యాన్ని జిల్లాలోని యల్లనూరు మండలం కూచివారిపల్లికి తరలించి అధిక ధరలకు విక్రయించేందుకు నిందితులు సిద్ధమైనట్లు విచారణలో తేలిందన్నారు. గోవా నుంచి తెలంగాణాలోని నాచారంకు ఫినోలెక్స్ కేబుల్ బాక్సులను తీసుకెళ్లాల్సి ఉండగా అక్రమంగా గోవా మద్యాన్ని బాక్సుల మధ్యలో ఉంచి జిల్లాలోకి తరలించేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిపారు. రూ. 4.52 లక్షలు విలువ చేసే గోవా మద్యం, 7496 కిలోల ఫినోలెక్స్ కేబుల్ బాక్సులు, ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వివిధ బ్రాండ్లకు చెందిన 147 బాక్సులు, 1294 లీటర్లు గోవా మద్యం మొత్తం విలువ రూ. 80 లక్షలు ఉంటుందని తెలిపారు. అక్రమ మద్యం తరలిస్తున్న నిందితులు అనంతపురం ఎన్‌టీఆర్ కాలనీ టీవీ టవర్‌కు చెందిన గొర్తి వంశీకృష్ణ, వజ్రకరూరు మండలం ధర్మపురి గ్రామానికి చెందిన అంకెల త్రినాథ్‌రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉండగా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం గుట్టురట్టు చేసిన పోలీసు సిబ్బందికి పారితోషికం అందజేశారు.

దామాషా పద్ధతిలో డివిజన్‌కు నిధులు

దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



నూతన కంట్రోల్ రూం భవనాన్ని ప్రారంభిస్తున్న రైల్వే జీఎం

గుంతకల్లు, జూలై 26: కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయించిన నిధులకు సంబంధించి ఏపీకి 9,130 కోట్లు వచ్చాయని, గుంతకల్లు రైల్వే డివిజన్‌కు అందులో నుంచి దామాషా పద్ధతిలో నిధులు వస్తాయని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన గుంతకల్లులో పర్యటించారు. ఉదయం రైల్వే డివిజనల్ కేంద్రమైన గుంతకల్లుకు వచ్చిన ఆయన డీఆర్ఎం కార్యాలయంలోని సమావేశ భవనంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిర్మించిన అత్యాధునిక రైల్వే కంట్రోల్ రూం భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి గణనీయమైన నిధులు వచ్చాయని, అందులో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు ఎంత వచ్చిందీ త్వరలో తెలుస్తుందన్నారు. బడ్జెట్ ద్వారా ఏ రైళ్లు వస్తాయో ఇంకా తెలియదని, ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడుపుతామన్నారు. బడ్జెట్ కేటాయింపులపై పూర్తి వివరాలు పింక్ బుక్ విడుదలైన తర్వాత తెలుస్తాయన్నారు. అనంతరం గుంతకల్లు రైల్వే జంక్షన్‌ను పరిశీలించి తిరుగు ప్రయాణమయ్యారు. కార్యక్రమంలో డీఆర్ఎం విజయకుమార్, ఏడీఆర్ఎం సుధాకర్ పాల్గొన్నారు.



ధ్వంసమైన పైపులను చూపుతున్న రైతు మల్లేశప్ప



విచారిస్తున్న పోలీసులు

డ్రిప్ పైపులు ధ్వంసం

ముక్కలుగా నరికిన దుండగులు
రూ.8లక్షలకుపైగా నష్టం
లబోదిబోమంటున్న కౌలు రైతులు

విడపనకల్లు, జూలై 26: మండల కేంద్రంలోని కౌలు రైతులు మల్లేశప్ప, పార్వతి పొలంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్ పైపులను ధ్వంసం చేశారు. ఎకరం రూ. 40వేలతో కౌలుకు తీసుకుని 16 ఎకరాల్లో మిరప కంది పంటలను వారు సాగు చేశారు. వారం రోజుల క్రితం మిరప విత్తనం సాగు చేసి వాటికి నీరు అందించేందుకు దాదాపుగా 170 డ్రిప్ పైపులను ఏర్పాటు చేశారు. మిరప విత్తనానికి నీటి తడులు ఇవ్వటంతో మిరప నారు మొలకెత్తింది. గురువారం గ్రామంలో చిన్నపీర్ల సందడి ఉండటంతో వారు పొలం వైపు వెళ్లలేదు. శుక్రవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వారు వెళ్లి అక్కడ పరిస్థితిని చూసి ఆందోళనకు గురయ్యారు. 170 డ్రిప్ పైపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. డ్రిప్ వేసిన సాలు సాలుకు ఓ తుంటలా నరికేశారు. కొన్ని పైపులను పూర్తిగా ఛిద్రం చేశారు. మిరప నారుకు వారం రోజుల్లో నీటితడులు ఇవ్వాలని, లేకపోతే పంట ఎండిపోతుందని వారు వాపోయారు. ప్రస్తుత పైపులను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు మరో వారం రోజులుపడుతుందన్నారు. రూ. 8 లక్షల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుసేన్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కత్తెరపురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టండి

జిల్లాఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్

పుట్టపర్తిరూరల్, జూలై 26: ఉమ్మడి జిల్లాలో సాగుచేసిన మొక్కజొన్న పంటకు కత్తెరపురుగు ఆశిస్తోందని, నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లాఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్ జిల్లా రైతాంగానికి ఒక ప్రకటనలో సూచించారు. ఈ సందర్భంగా ఆయన రైతాంగానికి పలు సూచనలుచేశారు. మొక్కజొన్న ప్రస్తుతం 20 రోజుల నుంచి 30 రోజుల దశలో ఉందని, ఈ మొదటిదశలో గొంగళిపురుగులు ఆకులపై పత్రహరితాన్ని గోకితింటూ ఆకులపై రంధ్రాలను చేస్తుందన్నారు. గొంగళిపురుగులు పెరిగేకొద్ది ఆకుల చివరల నుంచి తింటూ ఆకులను కత్తిరించినట్లు తినేయడం గమనించవచ్చన్నారు. గొంగళిపురుగుల (కత్తెర పురుగులు)ను నివారించడానికి ఎకరానికి 4 నుంచి 5 లింగార్షక బుట్టలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. పంటపొలాన్ని గమనించి పురుగుల గుడ్ల సముదాయాలను గుర్తించి ఏరినాశనం చేయాలన్నారు. గుడ్లను గమనించిన వెంటనే ఎకరానికి ఒకలీటర్ వేప నూనె పిచికారి చేయాలన్నారు. తొలిదశలో గొంగళి పురుగులను నివారంచడానికి ఎకరానికి 500మిల్లీలీటర్ల క్లోరిఫైరిఫాస్ మందు లేదా 400మిల్లీమీటర్ల క్వినాల్‌ఫాస్‌ను పిచికారి చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును 80 గ్రాములు లేదా స్పైనోసాడ్‌ను 60 మిల్లీలీటర్లు ఎకరానికి సుడులలోపు ఆకులు తడిసే విధంగా పిచికారి చేసుకోవాలన్నారు. ఈ మందులను అవసరాన్ని బట్టి రెండు మూడు సార్లు పిచికారి చేయాలన్నారు. ఎదిగిన గొంగళి పురుగు నివారణకు 10కిలోల తవుడు, 2 కిలోల బెల్లం 2 లీటర్ల నీటిలో కలిపి 24 గంటలపాటు పులియబెట్టి ఆ మిశ్రమాన్ని 100 గ్రాముల తయోకార్బ్ మందును జోడించి సాయంత్రం సుడుల లోపు వేయాలని సూచించారు.

కిలో టమోటా రూ.25

అనంతపురంరూరల్, జూలై 26: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టమోటా గరిష్ఠంగా రూ.25తో అమ్ముడుపోయాయి. ప్రస్తుతం మార్కెట్‌కు టమోటా ఉత్పత్తులు కొంతవరకు పెరిగాయి. 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.14 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.18 వేలు



అనంతపురంరూరల్, జూలై 26: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1188 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అంతపురం సెంట్రల్, జూలై 26: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ (ఆర్23) ఫలితాలను శుక్రవారం ప్రొఫెసర్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ విడుదల చేశారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డీసీఈ లలితకుమారి, విభాగాధిపతులు భారతి, కళ్యాణిరాధ, మమత, అజిత, భువనవిజయ, రామశేఖర్‌రెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

అంతపురం సెంట్రల్, జూలై 26: పాలిటెక్నిక్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టామని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 45సీట్లకు సంబంధించి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి 31న అడ్మిషన్లు ఇస్తామన్నారు.

తిరుపతి ప్యాసింజర్ పాక్షిక రద్దు కొనసాగింపు

గుంతకల్లు, జూలై 26: రైల్వే డివిజన్‌లో జరుగుతున్న యార్డు వర్కుల కారణంగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి మధ్య నడిచే ప్యాసింజరు (నెం.07589/90) రైలు పాక్షిక రద్దును మరో నెలపాటు కొనసాగించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరును ఆగస్టు 1 నుంచి 31వ తేదీదాకా, దాని తిరుగు ప్రయాణపు రైలును ఆగస్టు 2 నుంచి సెప్టెంబరు 1వ వరకు కదిరిదేవరపల్లి-గుంతకల్లు మధ్య పాక్షికంగా రద్దుచేసి కేవలం గుంతకల్లు-తిరుపతి మధ్యన మాత్రమే నడుపుతామన్నారు. ప్రయాణికులు విషయాన్ని గమనించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు.

విధుల నుంచి ఉపాధ్యాయుడి తొలగింపు

గార్లదిన్నె, జూలై 26: విద్యార్థులతో వెట్టి చాకిరీ చేయిస్తున్న ఉపాధ్యాయుడిని విధుల నుంచి ఉన్నతాధికారులు తొలగించారు. మండల కేంద్రమైన గార్లదిన్నె మైనార్టీ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు సుధాకర్ ఆ పాఠశాల విద్యార్థులతో తన ద్విచక్ర వాహనాన్ని కడిగిస్తున్నాడు. విద్యార్థుల తల్లిదండ్రులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు అతడిని విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు నాయక్ తెలిపారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె, జూలై 26: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హాస్టల్ నిర్వాహకుడి కుమారుడిపై పోలీసులు శుక్రవారం ఎస్సీ, ఎస్టీ వేధింపులు, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మర్తాడుకు చెందిన పాస్టర్ సయ్యద్ వలి గార్లదిన్నె రైల్వేగేట్ సమీపంలో మిస్పోగ్రేస్ హోప్ (క్రిస్టియన్) బాలికల హాస్టల్‌ను అనధికారికంగా నిర్వహిస్తున్నాడు. హాస్టల్‌లో ఉరవకొండ, బుక్కరాయసముద్రం, రాప్తాడు, విడపనకల్లు మండలాల నుంచి వివిధ గ్రామాలకు చెందిన సుమారు 10 మంది బాలికలు ఉంటున్నారు. పాస్టర్ సయ్యద్ వలి కుమారుడు నూర్‌బాషా తమపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు.. తల్లితండ్రులకు తెలియజేశారు. వారు హాస్టల్ వద్దకు చేరుకుని బాలికలతో మాట్లాడి నిర్వాహకుడితో గొడవకు దిగారు. నూర్‌బాషాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం నూర్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ వెంకటశివారెడ్డి విచారించి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యూనివర్సిటీలో రాజకీయాలు ఉండరాదు

● ఎస్కేయూ రిజిస్ట్రార్‌కు పరిటాల సునీత సూచన



ఎమ్మెల్యే పరిటాల సునీతను సన్మానిస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్

రామగిరి, జూలై 26: ఎస్కే యూనివర్సిటీలో రాజకీయాలకు చోటు లేదని ఏదైనా సరే నిబంధనల ప్రకారమే జరగాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ రమేశ్‌బాబుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. శుక్రవారం రిజిస్ట్రార్ వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాలసునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిచడంతోపాటు సౌకర్యాలు ఉండేలా చూడాలని సూచించారు. యూనివర్సిటీలో ఆ పార్టీ ఈ పార్టీ అనేది ఉండదరాదని, అసలు రాజకీయాలకే చోటు ఉండకూడదన్నారు. అందరూ కష్టపడి యూనివర్సిటీకి మంచిపేరు తీసుకురావాలని ఆమె సూచించారు.

మొక్కలను దత్తత తీసుకుని సంరక్షించాలి: ఎస్ఈ



హెచ్చెల్సీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్ఈ రాజశేఖర్

అనంతపురం క్లాక్ టవర్, జూలై 26: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని దత్తత తీసుకుని సంరక్షించాలని హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ కోరారు. ప్రభుత్వం చేపట్టిన హరిత అనంతలో భాగంగా శుక్రవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఎస్ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. కాలనీలో వెయ్యి మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా హెచ్చెల్సీ కాలవల కింద మరో 10వేల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. మొక్కలు నాటే ప్రతి ఒక్కరూ వాటిని దత్తత తీసుకుని పెద్ద వృక్షంగా మారే వరకు సంరక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ లోక్ డివిజన్ ఈఈ వెంకటరమణారెడ్డి, డీఈ మద్దిలేటి, ఇరిగేషన్ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ



అనంతపురం రేంజ్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎఫ్ఓ శర్మ

అనంతపురం న్యూటౌన్, జూలై 26: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన అటవీశాఖ అభివృద్ధి పనులపై విజిలెన్స్ డీఎఫ్ఓ రవిశంకర్ శర్మ, ఎఫ్ఆర్ఓ శంకరయ్య తమ బృందంతో కలిసి తనిఖీలు చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన కళ్యాణదుర్గం రేంజ్‌లోని పలు ప్రాంతాల్లో తనిఖీ చేపట్టి అభివృద్ధి పనులను పరిశీలించినట్లు డీఎఫ్ఓ వినీత్ కుమార్ తెలిపారు. కళ్యాణదుర్గం రేంజ్‌లో ఏర్పాటు చేయనున్న నగరవనాలతో పాటు రేంజ్ పరిధిలోని పలు నర్సరీలు, ప్లాంటేషన్‌తో పాటు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. అందులో భాగంగానే శుక్రవారం అనంతపురం రేంజ్ పరిధిలోని మరుట్ల సౌత్, నార్త్ బీట్స్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. అక్కడి నుంచి గుత్తి రేంజ్‌లోని పందికుంట బీట్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల పరిశీలనకు వెళ్లారన్నారు. తనిఖీల్లో రేంజర్ శ్రీనివాసులు, డీఆర్వో ఉసేనప్ప, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌బీఓ నీలవేణి పాల్గొన్నారు.

రేపు సచివాలయ ఉద్యోగుల సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అశోక్ బాబు, సచివాలయ ఉద్యోగులు

అనంతపురం న్యూటౌన్, జూలై 26: జిల్లా కేంద్రంలో ఆదివారం సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సమావేశానికి ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. అందులో భాగంగా శుక్రవారం నారాయణపురం పంచాయతీలోని సచివాలయం వద్ద సమావేశానికి సంబంధించిన పోస్టర్లను పంచాయతీ సెక్రటరీ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌బాబు ఆవిష్కరించారు. సమావేశానికి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుర్ రజాక్ హాజరవుతారన్నారు. సచివాలయ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశం జిల్లా కేంద్రంలోని పాతవూరు రమణ, రమేష్ థియేటర్‌లో ఉన్న పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో శివశంకర్, మహేష్, హనుమంతు, రామాంజనేయులు, మహేంద్రరెడ్డి, బాలచంద్రారెడ్డి, పవన్‌కుమార్, రఘు, వైష్ణవి, దివ్య, సుభాషిణి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు పదిమంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో పీవీకేకే కళాశాల యాజమాన్యం

అనంతపురంరూరల్, జూలై 26: మండలంలోని ఆలమూరు రోడ్డు వద్దనున్న పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో పది మంది ఉద్యోగాలు సాధించారు. శుక్రవారం కళాశాలలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. వంద మందికి పైగా డిగ్రీ, బీటెక్ విద్యార్థులు హాజరయ్యారు. ఆన్‌లైన్ పరీక్ష, ఆపరేషన్స్ ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూ అనంతరం పది మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ3.25లక్షలు వార్షిక వేతనం ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లె కిశోర్, కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి భానుకిరణ్, సంస్థ ప్రతినిధులు సల్మాన్ అహ్మద్, జావేద్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలపై ఆరా



వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఈఈ మురళీమోహన్

చెన్నేకొత్తపల్లి, జూలై 26: మండలంలోని ఎన్‌ఎస్‌గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎస్ఈ పీఆర్ ఇన్‌చార్జి ఈఈ మురళీమోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయానికి ఆస్పత్రికి వస్తున్నారా, చికిత్సలు, మందులు సక్రమంగా అందిస్తున్నారా అని అడిగారు. ఆస్పత్రిలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తాగునీటి వసతి, ల్యాబ్, ఆస్పత్రిలో పడకలు తదితర వాటిని ఆయన పరిశీలించారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు రవినాయక్, ప్రశాంత్, సూపర్‌వైజర్ వెంకటనారాయణ పాల్గొన్నారు.

కార్గిల్ అమరుల సేవలు మరువలేనివి

● విజయ్ దివస్‌లో వక్తలు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ సైనికులు, అతిథులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 26: కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల సేవలు మరువలేనివని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల నుంచి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి తిమ్మప్ప, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. నేటి యువత దేశం కోసం పాటుపడాలన్నారు. భారతదేశంలోని ప్రతిఒక్కరూ కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డాక్టర్ రంగనాథ్, ఎన్ఎస్ఎస్ విష్ణుప్రియ, బృందామేడం, ప్రభుత్వ హైస్కూల్ ఎన్‌సీసీ నాగేంద్ర, మాజీ సైనికుల సంఘం నాయకులు ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, గొల్ల ఈశ్వరయ్య, సంజీవకుమార్, జంగంశెట్టి సురేష్, మహమ్మద్ గౌస్, హుస్సేన్, తలమర్ల కృష్ణ, మణికుమార్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, సిద్దన్న, నాగరాజు, బాబా, శివశంకర్, మహమ్మద్ ఇర్షాద్ పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధవీరులకు సన్మానం

అంతపురం సెంట్రల్: కార్గిల్ యుద్ధంలో పోరాటం చేసిన మాజీ సైనికులను శుక్రవారం బీజేవైఎం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ సూర్యప్రకాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ రక్షణకోసం ప్రతి భారతీయుడు సైనికుడిగా పనిచేసేందుకు ముందడుగు వేస్తారన్నారు. జాతీయ భావన విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాలని సూచించారు. జవాన్లు తిమ్మప్ప, గోవింద్, అత్తార్‌బాషా, బీజేపీ నాయకులు నవీన్‌చౌదరి, హరీష్‌రెడ్డి, శాంతకుమార్, రాజేష్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

అనంతపురం ఎడ్యుకేషన్: రామ్‌నగర్‌లోని నారాయణ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సైనిక వేషధారణల్లో దేశభక్తి గీతాలకు నృత్యాలు చేస్తూ దేశానికి సైనిక దళం చేస్తున్న సేవలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ హనుమంతరెడ్డి, కోఆర్డినేటర్ రెడ్డి హరిత, ఏఓ నయాజ్, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



సైనికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు



సైనికుల వేషధారణలో నారాయణ పాఠశాల విద్యార్థులు


చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ మండల నాయకులు

అనంతపురంరూరల్, జూలై 26: మండలంలోని రాచానపల్లి గ్రామ చెరువు కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మురళీకృష్ణను మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, ఎంపీటీసీ క్రిష్ణారెడ్డి ఇతర నాయకులు శుక్రవారం కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చెరువు కబ్జాపై వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాచానపల్లి సర్వే నెంబరు 86లో 13.94 ఎకరాల చెరువు ఉందన్నారు. చెరువును ఆక్రమించినట్లు జూన్ 21న ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిందన్నారు. ఇదే క్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించి చెరువు ఆక్రమణకు గురైందని నివేదించారన్నారు. పోలీసులకు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారన్నారు. చెరువులో ఆక్రమణలను తొలగించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. టీడీపీ సత్యసాయి జిల్లా కుమ్మరసాధిక సమితి అధ్యక్షుడు రామాంజనేయులు, రాప్తాడు నియోజకవర్గ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు బిల్లా నాగరాజు, యాలేటి గోపాల్, రఘు, గంగాధర్, అనిల్ చౌదరి, సుధీర్ పాల్గొన్నారు.

నమోస్తు.. శాకంబరీ..



అలంకరణలో అమ్మవారు

అనంతపురం కల్చరల్, జూలై 26: ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. శ్రీనివాసనగర్‌లోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీదేవిగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. మహా మంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. అలాగే రామ్‌నగర్ యల్లమ్మ దేవాలయం, చెరువుకట్ట నిమిషాంబదేవి ఆలయం, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్ల మూలవిరాట్‌లను వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



బాబా ఫక్రుద్దీన్, కుళ్లాయిస్వామి పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, జూలై 26: స్థానిక ఐదవరోడ్డులోని బాబా ఫక్రుద్దీన్, గూగూడు కుళ్లాయిస్వామి పీర్ల మకానం వద్ద శుక్రవారం పీర్ల ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాల నడుమ పీర్లను వీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు పీర్లను దర్శించుకుని, చక్కెర చదివింపులు చేశారు. బాబా ఫక్రుద్దీన్, గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు



కుర్లపల్లిలో జలధికి తరులుతున్న పీర్లు

ధర్మవరంరూరల్(కనగానపల్లి), జూలై 26: మండలంలోని కుర్లపల్లి, తూంచెర్ల గ్రామాల్లో పీర్ల జలధి కార్యక్రమం శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఆయా గ్రామాల్లో పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేసి జలధికి తరలించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు.

లా పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఎస్కేయూ వీసీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ

అంతపురం సెంట్రల్, జూలై 26: లా విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత తనిఖీ చేశారు. న్యాయ విభాగంలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని పరిశీలించి పరీక్షల నిర్వహణ తీరుపై విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములును అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన పరీక్షల్లో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి జీవీ రమణ తెలిపారు.

నిత్య హత్యలు, దాడులతోనే వైసీపీ పాలన

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, జూలై 26: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు నిత్యం హత్యలు, దాడులు, కేసులతో చీకటి పాలన సాగించిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం చంద్రబాబునాయుడు గత ఐదేళ్లల్లో లా అండ్ ఆర్డర్‌పై విడుదల చేసిన శ్వేతపత్రంలో వైసీపీ అరాచక పాలనను కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. సాక్షాధారాలతో జగన్ అరాచకాలను సీఎం వెల్లడిస్తుంటే జగన్‌గొంతులో వెలక్కాయ పడినట్లైందన్నారు. అందుకే సింగిల్ కెమెరా ముందు కూర్చొని జగన్ అడ్డంగా వాదిస్తున్నారన్నారు. జగన్‌కు ధైర్యం ఉంటే అదే విషయాలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సవాల్ విసిరారు.

పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూలై 26: విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని ఆ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మట్టి తంబూర', 'మాకూ ఒక నది కావాలి' కవితా సంపుటాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. సాహితీకారులు, సాహిత్యాభిమానులు విరివిగా పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

అవగాహనతోనే వ్యాధుల నివారణ



కేజీబీవీలో వంట గదిని పరిశీలిస్తున్న వైద్యాధికారి

శింగనమల, జూలై 26: అవగాహనతోనే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని తరిమెల వైద్యాధికారి తేజశ్విని అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల, బీసీ వసతి గృహంలోని వంట గదిని ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు డయేరియా, సీజనల్ వ్యాధులపై అవగహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత చేతులు పరిశుభ్రతతోనే డయేరియా నియంత్రణ చేయవచ్చునని వంట గదులు మురుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని సిబ్బందికి తెలిపారు. ఈకార్యక్రమం దివ్యభారతి శైలజ కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు..

మెనూ ప్రకారం భోజనం అందించండి

రామగిరి, జూలై 26: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నసనకోట జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను, గంగంపల్లిలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమీల, సుష్మితతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ధర్మవరంరూరల్(కనగానపల్లి), జూలై 26: విషజ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యఆరోగ్య సిబ్బంది ప్రజలకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులచే కనగానపల్లిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు అబ్బాస్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు పంటసాగు ధ్రువీకరణ పత్రాలు

శింగనమల, జూలై 26: రైతులు సాగుచేసిన పంటలకు సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మద్దిలేటి తెలిపారు. శుక్రవారం మండలంలోని రాచేపల్లి, సలకంచెరువు రైతు భరోసా కేంద్రాల్లో సాగు ధ్రువీకరణ పత్రాలపై రైతులకు అవగహన సదస్సు నిర్వహించారు. డీడీ మద్దిలేటి, ఏడీఏ శైలజ ఏఓలు శ్రీనివాసులు, అన్వేష్ కుమార్, ఏఈఓ ప్రసాద్, సిబ్బంది రాజేశ్వరి, జయలక్ష్మి పాల్గొన్నారు.

కుష్టు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



చిన్నారిని పరీక్షిస్తున్న లెప్రసీ అధికారి అనుపమ జేమ్స్

రాప్తాడు, జూలై 26: కుష్టువ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా లెప్రసి అధికారి అనుపమ జేమ్స్ తెలిపారు. మండలంలోని మరూరు గ్రామంలో శుక్రవారం కుష్టు సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 18నుంచి ఆగస్టు 2 వరకూ లెప్రసీ సర్వే జరుగుతుందని తెలిపారు. గ్రామస్థులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి ఉన్నట్లు నిర్ధారణైతే వెంటనే పీహెచ్‌సీకి పంపాలన్నారు. వారికి సకాలంలో మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, ఏఎన్ఎం పావని, ఆశా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని యర్రగుంట్లలో వైద్యాధికారి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ కుష్టువ్యాధి సోకిన వారికి స్పర్శలేని, రాగి రంగులతో ఉండే మచ్చలు తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ లక్షణాలు ఉన్న వారు వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగేశ్వరయ్య, విశ్వనాథ్, అరుణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యేలు



డీజీపీతో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు

అనంతపురం అర్బన్, జూలై 26: డీజీపీ ద్వారకా తిరుమలరావును అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కలిశారు. శుక్రవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఇద్దరు ఎమ్మెల్యేలు డీజీపీని కలిసి పలు అంశాలపై చర్చించారు. వైసీపీ హయాం తరహాలో కాకుండా పార్టీలకు అతీతంగా పోలీసు వ్యవస్థ పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఎల్లప్పుడూ తమవంతు సహకారం అందిస్తామని, తప్పు ఎవరు చేసినా చర్యలు తీసుకునే విధంగా క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే శ్రావణిశ్రీ...



డీజీపీతో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, జూలై 26: ఆంధ్రప్రదేశ్ డీజీపీని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కలిశారు. శుక్రవారం విజయవాడలో డీజీపీ కార్యాలయంలో తిరుమలరావును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గంలో శాంతి భద్రతల గురించి చర్చించారు.

సీఎంను కలిసిన మాసినేని గ్రూప్ సంస్థల చైర్మన్



సీఎంకు వెంకటేశ్వరుడి ప్రతిమను అందజేస్తున్న చైర్మన్, తదితరులు

కూడేరు, జూలై 26: ముఖ్యమంత్రి చంద్రబాబును మాసినేని గ్రూప్ సంస్థల చైర్మన్ మాసినేని రామయ్య కలిశారు. శుక్రవారం అమరావతిలో సీఎం క్యాంపు కార్యాలయంలో మాసినేని రామయ్య, మాసినేని అమరేంద్ర, కూచి అశోక్ సీఎంను కలసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రులను కలిసిన పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు



మంత్రి నిమ్మల రామానాయుడును కలిసిన చాంబర్ సభ్యులు

శింగనమల, జూలై 26: మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్‌లను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు కలిశారు. శుక్రవారం విజయవాడ సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను చాంబర్ జాతీయ అధ్యక్షుడు వైవీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కార్యదర్శి దేగలకృష్ణమూర్తి, కార్యదర్శి ఇస్మాయిల్, అనంతపురం ఉమ్మడి సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణ్, ఓంకార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరించారు.

కుమ్మర, శాలివాహనుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సమితి నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 26: జిల్లాలోని కుమ్మర, శాలివాహనుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను టీడీపీ కుమ్మర, శాలివాహన సమితి నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆ సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, నాయకులు వెంకటనారాయణ, రామాంజనేయులు, నరసింహులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ కులవృత్తులు కనుమరుగైన పరిస్థితుల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు తయారు చేసుకుని జీవిస్తున్నారన్నారు. ఆ విగ్రహాలకు మార్కెట్ సదుపాయం కల్పించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. సూరి, నాగమణి, చంద్ర, శివ, రాజేంద్ర పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి గుండంలో అగ్నిజ్వాలలు



గుండంలో వెలుగుతున్న మంటలను తిలకిస్తున్న ప్రజలు

శింగనమల జూలై 26: ప్రసిద్ధి గాంచిన గూగూడు కుళ్లాయిస్వామి మకాన్ ఎదుట ఉన్న అగ్నిగుండంలో ఇప్పటికీ అగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. బ్రహోత్సవాలు ముగిసిన వెంటనే అగ్నిగుండాన్ని ఆనవాయితీ ప్రకారం రాళ్లు, మట్టితో మూసివేస్తారు. పది రోజులైనా గుండంలో ఇప్పటికీ మంటలు వస్తుండటం స్వామి మహత్యమని భక్తులు నమ్ముతున్నారు. గుండంలో వెలుగుతున్న మంటలను చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. గూగూడులో గుండం పూడ్చిన తరువాత ఎప్పుడూ ఇలా మంటలు దాఖలాల్లేవని భక్తులు అంటున్నారు.



గుండంలో ఎగసిపడుతున్న మంటలు

అత్త మందలించిందని అల్లుడి అదృశ్యం..!

అనంతపురం క్రైం, జూలై 26: బైక్ తాకట్టు పెట్టిన విషయంపై అత్త మందలించడంతో అల్లుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని ప్రియాంకనగర్‌కు చెందిన షేక్ లతీఫ్ కుమారుడు షేక్ సాదిక్‌కు రెండేళ్ల క్రితం తాడిపత్రి పట్టణానికి చెందిన అమీనాబాను కుమార్తె హసీనాబానుతో వివాహం జరిగింది. హసీనాకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తాడిపత్రిలోనే భార్య ఇంటికి ఇల్లరికం వెళ్లాడు. సాదిక్‌కు వాళ్ల అత్త బైక్ కొనిచ్చింది. ఆ బైక్‌ను సాదిక్ డబ్బు కోసం వేరేవాళ్లకు కుదువపెట్టాడు. మూడు నెలల క్రితం తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. రెండురోజులు ఇంటి వద్దే ఉన్నాడు. సాదిక్ తల్లి కేరళకు వెళ్లి ఏప్రిల్ 9న ఇంటికి వచ్చి చూస్తే కొడుకు కనిపించలేదు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. దీంతో తల్లి షేక్ దిల్షాద్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

కూడేరు, జూలై 26: మండలంలోని కమ్మూరు గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు చేసి పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. పేకాట జరుగుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడులు చేశామని, పేకాట ఆడుతున్న 14మందిని అరెస్టు చేశామని, వారినుంచి రూ.72,300 నగదు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. వీరందరిపై కేసున మోదు చేసినట్లు చెప్పారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

కూడేరు, జూలై 26: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈఓ సాయికృష్ణ సూచించారు. మండలంలోని ఎంఎంహళ్లి, కడదరకుంట, చోళసముద్రం, జయపురం గ్రామాల్లోని బడిబయట పిల్లల తల్లిదండ్రులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. బడిఈడు పిల్లలు ఎవరైనా బడికి రాకుండా ఉంటే వారిని తప్పక బడికి పంపించాలని సూచించారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీ శివప్రసాద్ ఉన్నారు.

సర్పంచ్ అవినీతిపై విచారణ చేపట్టాలి


డీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

ఉరవకొండ, జూలై 26: ఉరవకొండ మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని టీడీపీ మద్దతు వార్డు సభ్యులు కోరారు. ఈ మేరకు డీపీఓ ప్రభాకర్ రావును శుక్రవారం అనంతపురంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ సర్పంచ్ చేయని పనులకు కూడా బిల్లులు పెట్టుకుని డ్రా చేశారన్నారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటులో రూ.5లక్షల దాకా నిధులను దుర్వినియోగం చేశారని, ఉరవకొండ రథోత్సవానికి సంబంధించిన బిల్లులో కూడా అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రామాంజనేయులు, నిరంజన్‌గౌడ్, ప్రభాకర్, వాసుదేవుడు పాల్గొన్నారు.

కడవకల్లులో చోరీ

పుట్లూరు, జూలై 26: మండలంలోని కడవకల్లు గ్రామంలో ఆదినారాయణ అనే వ్యక్తి ఇంటిలో దొంగతనం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ హేమాద్రి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ తన కుటుంబంతో బుధవారం శింగనమల మండలం కొరివిపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం తిరిగి వచ్చారు. అయితే ఇంటితాళాలు పగులిపోయి ఉండడంతో లోపలి వెళ్లి చూశారు. బీరువా తెరచి ఉండడం, అందులో రూ. 80 కనిపించకపోవడాన్ని చూసి చోరీ జరిగిందని గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన

పెద్దపప్పూరు, జూలై 26: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల మాతా శిశుమరణాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు ఫోన్‌చేయాలని సూచించారు. అధ్యాపకులు, పాల్గొన్నారు.

కుక్కలదాడిలో జింక మృతి

పుట్లూరు, జూలై 26: మండలంలోని చింతకుంట గ్రామశివారులోని హెచ్చెల్సీలో కుక్కలదాడి చేయడంతో జింక మృతిచెందింది. సుమారు మూడు కుక్కలు జింకను పొలాల్లో నుంచి తరమడంతో హెచ్చెల్సీలో వచ్చి పడింది. దాడిచేస్తుండగా వాహనదారులు చూసి కుక్కలను తరిమికొట్టారు. గాయాలు కావడంతో కొద్దిసేపటికి మృతిచెందింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని మృతిచెందిన జింకను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పూడ్చిపెట్టినట్లు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కుందుర్పి, జూలై 26: ఉపాధి పనులలో అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ రవీంద్రా రెడ్డి సస్పెన్షన్‌కు గురైనట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ పని చేస్తున్న మండలంలోని తెనగల్లుకు చెందిన రవీంద్రారెడ్డి భారీస్థాయిలో నిధులు దుర్వినియోగం చేసినట్లు ఇటీవల జరిగినసామాజిక తనిఖీలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రవీంద్రారెడ్డిని సస్పెన్షన్ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

ముద్దచర్మవ్యాధి నివారణకు టీకాలు

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 26: మండలంలోని లక్ష్మంపల్లిలో మండల పశువైద్య సహాయ సంచాలకుడు నాగ లింగేశ్వరరెడ్డి, వైద్యాధికారి ప్రసాద్, వైద్యులు, శుక్రవారం పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి తనిఖీ

తాడిపత్రి, జూలై 26: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని జిల్లా మలేరియా అధికారి ఓబులు, అడిషనల్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డెంగీ ఎలీసా టెస్ట్ రీడర్‌ను పరిశీలించి ఎల్‌టీలకు తగు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం మలేరియా సబ్‌యూనిట్ రికార్డులు, స్టాక్‌వివరాలను పరిశీలించారు. అలాగే మండలంలోని చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. వారివెంట సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, డాక్టర్ లావణ్య తదితరులు ఉన్నారు.

31న గెస్ట్ ఫ్యాకల్టీ కోసం ఇంటర్వ్యూ

కళ్యాణదుర్గంరూరల్, జూలై 26: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు ఇంటర్వ్యూ ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయరామరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, కామర్స్, మేథమేటిక్స్ సబ్జెక్టులను బోధించడానికి అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

కళ్యాణదుర్గం, జూలై 26: మండలంలోని దురదకుంట గ్రామంలో పశుసంవర్థక శాఖ, శ్రీసత్యసాయి సమితి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 1606 వివిధ పశువులకు పశువైద్యసేవలు అందించామని పశువైద్యులు తెలిపారు. గర్భకోశ వ్యాధులకు, దీర్ఘ కాలిక వ్యాధలకు చికిత్స చేసి నట్టలు, పిడుదులు, గోమారి నివారణకు మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యుడు పద్మనాభం, సహాయ సంచాలకులు రమేష్, మంజునాథ, హరణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● డిప్యూటీ డీఈఓ నాగరాజు సూచన


విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ నాగరాజు

డీ.హీరేహాళ్, జూలై 26: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నా ణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని డిప్యూటీ డీఈఓ నాగరాజు సూచించారు. మండలంలోని కల్యం గ్రామ జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల, మండల పరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. భోజనాలు ఎలా ఉ న్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మధ్యాహ్నభోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి పొరబాట్లు జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామస్థుల కోరిక మేరకు ఈ పాఠశాలల విలీనంపై నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని ఆయన తెలిపారు.

మెనూ పాటించాల్సిందే..

యాడికి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. మండలంలోని నిట్టూరు హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఆమె తనిఖీచేశారు. మెనూపై హెచ్ఎంశివరామిరెడ్డిని, భోజన ఏజెన్సీ నిర్వాహకులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అమల్లో మెనూ కచ్చితంగా పాటించాలన్నారు. భోజనం నాణ్యతపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


పామిడిలో మాజీ సైనికుడిని సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గం రూరల్ జూలై 26: పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్గిల్ విజయ దివస్‌ను ఘనంగా నిర్వ హించారు. 1999లో కార్గిల్ యుద్ధంలో శత్రుదళాలపై సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న అప్పటి సైనికులు అంజన్‌కుమార్, సుబ్బారెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ కార్గిల్‌లో మన సైనికుల యొక్క ధీరత్వము, త్యాగాలను గుర్తించడం ప్రతి భారత పౌరుని బాధ్యత అని అన్నారు. మాజీ సైనికుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ భారత్‌సైన్యం చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ దొడ్డ నాగప్ప, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పరీషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న పట్టణంలోని నాయబ్, సుబేదార్, జింకారామ్మూర్తిలను ఘనంగా సత్కరించారు. వారి ధైర్యసాహసాల గురించి వివరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలో బీజేపీ నాయకులు వివిధ పాఠశాలల విద్యార్థులతో కార్గిల్ విజయ దివస్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి దేశ భక్తిపై తమ మద్దతు తెలియజేశారు. తర్వాత కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సుబేదార్ ఈశ్వరయ్య, మాజీ సైనికోద్యోగి లక్ష్మీనారాయణను సత్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంజినాయక్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

యాడికి: కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకొని మండలకేంద్రంలోని లయన్స్ క్లబ్ సభ్యులు కార్గిల్ అమరవీరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా సూర్యనారాయణ మాట్లాడుతూ దేశం కోసం పోరాడి అమరులైన జవాన్ల త్యాగఫలం వెలకట్టలేనిదని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

తాడిపత్రి, జూలై 26: మండలంలోని ఊరుచింతల గ్రామానికి చెందిన వివాహిత రమ్యరాధిక (28) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రమ్యరాధికకు 8ఏళ్లక్రితం వివాహమైంది. చంద్రశేఖర్ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తిచెందిన రమ్యరాధిక ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని సీఐ తెలిపారు.

మనస్తాపం చెంది యువకుడు..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మొదీనాబాద్‌లో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మొదీనాబాద్‌కు చెందిన మస్తానమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన ఆంజనేయులు (26) బేల్దారి పనికి వెళ్లేవాడు. అయితే గత కొద్ది రోజులుగా తాగుడుకు బానిసై పనికి వెళ్లటం లేదు. దీంతో శుక్రవారం సాయంత్రం మస్తానమ్మ ఆంజనేయులును మందలించింది. మనస్తాపం చెందిన అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వఆసుపత్రికి తరలించామని, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తుంగభద్ర జలాలకు గంగపూజ


చెరువులో గంగపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూలై 26 : టీబీడ్యాం నుంచి మండలకేంద్రంలోని చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు చేరిన తుంగభద్ర జలాలకు శుక్రవారం ఉదయం స్థానిక టీడీపీ నాయకులు గంగపూజ చేసి స్వాగతం పలికారు. చెరువు వద్ద వేదపండితులతో గంగపూజ చేయించి చీర, సారెలను చెరువులోకి వదిలారు. కార్యక్రమంలో నాయకులు లాలెప్ప, ఆనందరాజ్, వేలూరు మరియప్ప, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, షేక్‌ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల గొడవపై డీఎస్పీ విచారణ

యాడికి, జూలై 26: మండలంలోని పుప్పాల గ్రామంలో గత గురువారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవపై తాడిపత్రి డీఎస్పీ జనార్దన్‌నాయుడు శుక్రవారం విచారణ చేపట్టారు. పుప్పాల గ్రామానికి వచ్చిన ఆయన గొడవపై ఇరువర్గీయులను, గ్రామస్థులను ఆరాతీశారు. గాయపడిన వారి వివరాలు తెలుసుకున్నారు. గొడవలను సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐని ఆదేశించారు. ఆయన వెంట సీఐ నాగార్జునరెడ్డి ఉన్నారు.

ఇరువర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు

పుప్పాలలో జరిగిన గొడవకు సంబంధించి టీడీపీకి చెందిన ఎనిమిది మందిపై, వైసీపీకి చెందిన 10మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. టీడీపీకి చెందిన చెంచు రాజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు వైసీపీ వర్గీయులు సుధాకర్, మురళీ, సుదర్శన్, రామాంజనేయులు, దేవేంద్ర, ఈశ్వర్‌రెడ్డి, చిన్నవీరయ్య, గంగరాజు, అశోక్, రంగస్వామినాయక్‌లపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. వైసీపీకి చెందిన సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ వర్గీయులు దేవేంద్ర, సుంకిరెడ్డి, శివ, చరణ్, తేజ, ప్రభాకర్, సురేష్, మహేష్‌లపై కేసు నమోదుచేసినట్లు సీఐ చెప్పారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పునఃప్రారంభించాలి

రాయదుర్గంరూరల్, జూలై 26: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు తక్షణమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి స్థానిక కణేకల్లు రోడ్డుపై ఖాళీ ప్లేట్లతో బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని రా ష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలను కోరామన్నారు. ఎవరూ మాట్లాడలేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని పునః ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌గౌతమ్, అనిల్, సందీప్, భాను, ప్రకాష్, విష్ణు, తిప్పేసి తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకూలిన వేపచెట్టు

గుత్తి, జూలై 26: పట్టణంలోని కోట వీధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఈదురు గాలులకు వేప చెట్టు నేలకూలింది. అయితే ఆ సమయంలో ఎవరూ అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ అధికారులు ఆ చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారు.


కూలిన వేప చెట్టు

పొలంబడిపై అవగాహన

పామిడి, జూలై 26: మండలంలోని కండ్లపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పొలంబడిపై అవగాహన, గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి ఏడీఏ వెంకటరాముడు మాట్లాడుతూ... రైతులు పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించడంపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి లీనావసుంధర, ఏఈఓ శ్రీనివాసరావు, ఎంపీఈఓ రామాంజనేయులు, వీఏఏ వర్ష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు

కూడేరు, జూలై 26: రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని, దీంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు సూచించారు. మండలంలోని కమ్మూ రులో శుక్రవారం ఆయన ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. వంటకు వాడే నూనెను తయారు చేసేందుకు ఆయిల్ ఫామ్ తోటలను జిల్లాలోని బొమ్మనహాళ్, కణేకల్, ఉరవకొండ, వజ్రాకరూర్, కూడేరు మండలాల్లో సాగు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కనుక రైతులు వాటిని సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, సర్పంచ్ రంగారెడ్డి, అరవకూరు సర్పంచు రామాంజనేయులు, మండల ఉద్యానశాఖ అధికారి నెట్టికంఠయ్య, ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు హక్కు పత్రాలపై అవగాహన

రాయదుర్గంరూరల్, జూలై 26 : మండలంలోని కౌలురైతులకు కౌలు హక్కు పత్రాలపై వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మణ్ అవగాహన కల్పించారు. పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఆయన కౌలు రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌలురైతులు కౌలుహక్కు పత్రాలను తప్పక పొందాలని సూచించారు. ఈ కార్డు పొందుటకు భూ యజమాని ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రూ. 10ల అగ్రిమెంట్ మీద ఒ ప్పందం రాసుకుని ఉండాల్సి ఉంటుందన్నారు. ఈ విధంగా ఒప్పందం రాసుకోవడం వల్ల పంట సాగు చేసుకునే రైతుకు 11 మాసాల తాను సాగు చేసే పంటపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. భూమిపై ఎటువంటి హక్కు ఉండదని తెలిపారు. కావున భూ యజమానులు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఒప్పంద పత్రం రాసి ఇవ్వొచ్చని తెలిపారు. ఈ కౌలు హక్కు పత్రం పొందడం వల్ల కౌలురైతులకు పంట నష్టపరిహారం, బ్యాంకులో పంట రుణం, పెట్టుబడి సాయం, సబ్సిడీపై విత్తనాలు తదితరాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కౌలురైతులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మండలంలోని కసాపురం, దోనిముక్కల గ్రామాల్లో ఏఓ స్వాతి.. కౌలు రైతులకు కౌలు హక్కు పత్రంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు హక్కు పత్రాలను పొందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నింబగల్లు హెడ్‌రెగ్యులేటర్‌కు తుంగభద్ర జలాలు

ఉరవకొండ ,జూలై 26: మండలంలోని నింబగల్లు సమీపంలో ఉన్న హెచ్చెల్సీ హెడ్‌రెగ్యులేటర్‌కు శుక్రవారం సాయంత్రం తుంగభద్ర జలాలు చేరాయి. బుధవారం అర్ధరాత్రి కణేకల్లు చెరువుకు చేరగా.. హెచ్చెల్సీ అధికారులు శుక్రవారం ఉదయం ఆ చెరువు నుంచి కాలువకు వదిలారు. నెరమెట్ల వద్దకు నీరు చేరగానే ప్రజలు పూజలు చేశారు. తాగు నీటి అవసరాల కోసం పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు.

వాల్మీకి సంఘం మండలాల అధ్యక్షుల ఎన్నిక

బొమ్మనహాళ్/ కణేకల్లు, జూలై 26: బోయ వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని వన్నళ్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కేపీ వన్నూరుస్వామి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్‌నాయుడు నియామకపత్రాన్ని అందించినట్లు వన్నూరుస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అలాగే సంఘం కణేకల్లు మండల అధ్యక్షుడిగా ఉడేగోళం గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌ను రాష్ట్ర అధ్యక్షుడు ఎంపిక చేశారు.

31న స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గంరూరల్, జూలై 26: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులలో మొదటి సంవత్సరంలో చేరడానికి స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఆసక్తి కలిగిన విద్యార్థులు 30వ తేదీలోగా దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 31న రూ. 5800 లు చెల్లించి తమ సీటును ధృవీకరించుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ కోరారు.

108 టెక్నీషియన్ ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, జూలై 26: పట్టణంలోని విజయ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న 108 వాహనం టెక్నీషియన్ రాఘవరెడ్డి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. రాఘవరెడ్డి కర్నూలు జిల్లా చిప్పగిరి మండలంలో 108 వాహనానికి టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం అతను విధులకు వెళ్లాడు. రాత్రి అతని భార్య ఇంటికి తాళం వేసి మస్తానయ్య దర్గా సమీపంలోఉన్న తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. ఇదే అదనుగా గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలకి చొరబడ్డారు. బీరువాలో పెట్టిన రూ.3.80 లక్షల నగదు, మూడున్నర తులాల విలువ చేసే రెండు ఉంగరాలు, రెండు చైన్లు, మూడు జతల కమ్మలను ఎత్తుకెళ్లారు. రాఘవరెడ్డి శుక్రవారం ఉదయం చోరీ జరిగిన విషయాన్ని గ్రహించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం నుంచి క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. డీఎస్పీ బంగ్లాకు కూతవేట దూరంలో దొంగతనం జరగటం గమనార్హం. రాఘవరెడ్డి ఇంటి ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన మాసినేని రామయ్య


సీఎంతో మాసినేని రామయ్య తదితరులు

కూడేరు, జూలై 26: ముఖ్యమంత్రి చంద్రబాబును మాసినేని గ్రూప్ సంస్థల చైర్మన్ మాసినేని రామయ్య శుక్రవారం కలిశారు. అమరావతిలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు, వెంటేశ్వర స్వామి ప్రతిమ అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కూ డా కలిశారు. మాసినేని అమరేంద్ర, కూచి అశోక్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేశవ్‌ను కలిసిన బంజారా సంఘం నాయకులు


మంత్రికి చిత్రపటాన్ని అందజేస్తున్న బంజారా నాయకులు

ఉరవకొండ, జూలై 26: ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను బంజారా గిరిజన సమైక్య జాతీయ అధ్యక్షుడు మహేష్ నాయక్, సేవాఘడ్ సాంస్కృతిక విభాగం ఆర్గనైజర్ రామచంద్రనాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం వారు మంత్రిని కలిసి శాలువాతో సత్కరించి, సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ.50లక్షలు కేటాయించాలని సీఎంను చంద్రబాబును కోరడం హర్షణీయమన్నారు.

హోంమంత్రిని కలిసిన తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి


హోంమంత్రి అనితతో లావణ్య

తాడిపత్రి, జూలై 26: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను మండలంలోని చిన్నపొలమడ గ్రామానికి చెందిన టీడీపీ మహిళా రాష్ట్ర కార్యదర్శి లావణ్య కలిశారు. విజయవాడలో శుక్రవారం ఆమె హోంమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సామాజికవర్గానికి చెందిన తమను గుర్తించి గుర్తింపు ఇవ్వాలని హోంమంత్రిని కోరినట్లు ఆమె తెలిపారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బండారు ఆనంద్


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో బండారు ఆనంద్

గుంతకల్లు, జూలై 26: టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును కలిశారు. విజయవాడలో శుక్రవారం ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు చౌదరి, కుళ్లాయి పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బ్రహ్మసముద్రం, జూలై 26 : మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఆర్ట్స్ గ్రూపులోగల మిగులు సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నామని, 2023-24 టెన్త్ ఫలితాల్లో 360 పైగా మార్కులు సాధించిన బాలికలు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సీఈసీ, హెచ్ఈసీ కింద పది సీట్లు ఉన్నాయని, అడ్మిషన్ కావాల్సిన విద్యార్థినులు నేరుగా తనను కలవాలని ఆమె సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుంతకల్లుటౌన్, జూలై 26: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, గుమ్మనూరు హర్షిత పెళ్లిరోజు సందర్భంగా పట్టణంలోని నారా లోకేష్ ఫౌండేషన్ వారు శుక్రవారం 14వవార్డులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అలాగే పలు విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, టీడీపీ నాయకులు సతీష్‌కుమార్, మహేష్‌కుమార్, సిద్దా, రమేష్, కుమార్,ఆరీఫ్, విజయ్, అంజి, హరీష్ పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తి చేయండి

బెళుగుప్ప, జూలై 26: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను పూర్తి చేయాలని నోడల్ అధికారిణి సుజాత వైద్యులకు, సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె డీపీఎంవో రవి శంకర్‌తో కలిసి తనిఖీ చేశారు. వైద్యులు కార్తీక్ రెడ్డి, ప్రియాంక, లోకేష్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆగస్టు 2వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అవసరమైన వారందరికీ సకాలంలో వ్యాధి నివారణ టీకాలు వేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తర్వాత వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించారు. ఎంపీహెచ్ఈవో విజయ్‌కుమార్, సిబ్బంది రవిరాజు, వెంకటనాయుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా పెద్దమ్మ



యాడికి, జూలై 26: ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని, ఉదయమే అర్చకులు ఆలయాన్ని ఆకుకూరలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

పామిడి: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున నుంచే అర్చకులు అమ్మవారికి ప్రాతఃకాల అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వివిధ ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో శాకంబరీదేవిగా అలంకరించారు. సాయంత్రం వాసవి మాతృ మండలి సభ్యులు లలిత సహస్రనామ పారాయణం చేపట్టారు. వాసవి అష్టోత్తర శత నామావళి, కుంకుమార్చన చేశారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం చేపట్టారు. అలాగే ఊయలలో కొలువుదీర్చి డోలోత్సవం చేశారు.

దుర్గాభవానికి ప్రత్యేక పూజలు

ఉరవకొండ: పట్టణంలోని రాంనగర్‌లో వెలసిన దుర్గాభవాని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని కుంకుమార్చనలు చేయించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

యల్లనూరు, జూలై 26: మండలకేంద్రంలో శుక్రవారం బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆరు సంవత్సరాల బాలుడు బాషాకు తీవ్రగాయాలయ్యాయి. తాడిపత్రి వైపునకు వెళుతున్న బొలెరో వాహనం ప్రధాన వీధిలో ఇంటి బయట ఉన్న బాలున్ని ఢీకొంది. బాలుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.